క్లుప్తంగా

మహేశ్వరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా జయమ్మ



మహేశ్వరం: మహేశ్వరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా తుమ్మలూరు డైరెక్టర్ చెన్‌రెడ్డి జయమ్మను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్ పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక జీఓను తీసుకుచ్చి ఎన్నికైన డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ,కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ సహకారంతో తనకు చైర్‌పర్సన్‌గా అవకాశం వచ్చిందని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భాగ్యనగర్ సొసైటీ చైర్మన్‌గా బాబు



బడంగ్‌పేట్: బాలాపూర్ మండల పరిధిలోని నాదర్‌గుల్ భాగ్యనగర్ సహకార సంఘం చైర్మన్‌గా బంగారు బాబును నియమిస్తూ సోమవారం ఉత్వర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకు మద్ది నర్సింహారెడ్డి చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా బంగారు బాబు కొనసాగుతూ ఉండేవారు. టీఆర్‌ఎస్‌కు చెందిన నర్సింహారెడ్డిని చైర్మన్ పదవి నుంచి తొలగించి ఆయన స్థానంలో వైస్ చైర్మన్‌గా ఉన్న బంగారు బాబు(కాంగ్రెస్)ను నియమిస్తూ జిల్లా సహకారం సంఘం అధికారి ఉత్తర్వులు ఇచ్చారు. సంఘం సభ్యులుగా నర్సింహారెడ్డి, పుల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జ్యోతి, సుదర్శన్‌రెడ్డి, తిరుపతి గిరిరాజ్, మోహన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ ప్రతినిధులు

పహాడీషరీఫ్: బాలాపూర్ మండలం మామిడిపల్లిలోని ప్రాచీనమైన బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. ఆలయ కమిటీ ఈఓ మురళీ కృష్ణ, జిల్లెలగూడ ఆలయ ఈఓ వై.శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో పాలక మండలి చైర్మన్ కల్లెం నరేశ్ గౌడ్ సమక్షంలో ఆరు నెలలకు సంబంధించి లెక్కింపు చేపట్టారు. రూ.1,10,597 కానుకలు వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లాల్ సతీశ్ గౌడ్, లాల్ విజయ్‌గౌడ్, కమిటీ డైరెక్టర్లు చెన్నయ్య, శేఖర్ ముదిరాజ్, భాస్కర్, రాధిక, అనిత, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే సబితకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కందుకూరు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు క్యాంపు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మహిళా కమిటీ జిల్లా కన్వీనర్ కవిత, అంగన్‌వాడీ సంఘం నాయకులు శేఖర్, లక్ష్మి, సుమతి, తేజ, రాణి, రాధిక, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి చర్యలు

వనస్థలిపురం: డివిజన్ పరిధి క్రాంతిహిల్స్ కాలనీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం క్రాంతిహిల్స్ కాలనీకి సంబంధించి నూతనంగా నిర్మించనున్న ముఖ ద్వారానికి ఆయన శంకుస్థాపన చేశారు.

- వనస్థలిపురం డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీలో సోమవారం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్ నెంబర్ 1, 2 లలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు పొంగిపొర్లుతూ రోడ్లపై పారుతుండడంతో మురుగు, వరద నీరు రోడ్లపై నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లకు యాప్

- నిర్మాణ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్
- లబ్ధిదారులకు తప్పనున్న కష్టాలు
- నిర్మాణాలు ప్రారంభించని పేదలకు మహిళా సమాఖ్య నుంచి రుణాలు



పెద్దమ్మ తండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు

మహేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినప ఇందిరమ్మ ఇళ్ల పథకం మరింత పారదర్శకంగా మారింది. ఇకపై అధికారులు ఫొటోలు తీయకుండా లబ్ధిదారులే యాప్ ద్వారా ఇళ్ల పొటోలు అప్‌లోడ్ చేసే అవకాశాన్ని సర్కార్ కల్పించింది. ఆ ఫొటోలను పరిశీలించిన తర్వాత బిల్లు విడుదల చేయనున్నారు. దీంతో సకాలంలో ఆర్థికసాయం అందనుంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతున్న క్రమంలో ఇప్పటి వరకు హౌసింగ్ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఫోటోలు తీసేవారు. దీంతో లబ్ధిదారులకు బిల్లులు అందడంలో జాప్యం అవుతుండడంతో ఈ యాప్‌ను తీసుకువచ్చారు.

అప్‌లోడ్ విధానం

- మొబైల్‌లోని ప్లే స్టోర్ నుంచి ఇందిరమ్మ ఇళ్ల యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. బెనిఫిషయరీ లాగిన్‌తో ఓటీపీ ఎంటర్ చేయాలి. తర్వాత డాష్ బోర్డులో లబ్ధిదారు పేరు, మొబైల్ నంబర్ తదితర వివరాలతో పాటు ఫోటోలు తీయడం, ఇళ్ల నిర్మాణపు దశలు తదితరాలు కన్పిస్తాయి.
- లబ్ధిదారు ఇంటి నిర్మాణ దశను ఫోటో అప్‌లోడ్ చేయాలి. మ్యాప్ సింబల్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలి. ఒక సారి సరిచూసుకున్న తర్వాత సబ్మిట్ చేసి, గ్రౌండింగ్ బటన్‌పై క్లిక్ చేస్తే వివరాలన్నీ కనిపిస్తాయి. బేస్మెంట్ స్థాయిలో నిర్మాణపు పనులు జరుగుతున్న ఇంటి వద్ద లబ్ధిదారులతో పాటు నలువైపులా ఫొటోలు తీయాలి. ఈ ఫోటోలు ఇంటి ప్రాంతం నుంచే తీసి, వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. గ్రామ కార్యదర్శులు, ఎంపీడీఓలు, హౌసింగ్ డీఈఈలు, పీడీలు తదితర అధికారులు వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూసుకుని లబ్ధిదారులకు బిల్లులు అందిస్తారు. సాంకేతిక సమస్యలు, పేమెంట్, ఇతర సమస్యలపై టోల్‌ఫ్రీ 18005995991 నంబర్‌లో సంప్రదించవచ్చు.

పథకం అమలు తీరు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి దశలో ముగ్గు పోసి.. బేస్మెంట్ నిర్మించిన తర్వాత లబ్ధిదారురాలి ఖాతాల్లో నగదు జమ చేస్తారు. గోడలు నిర్మించిన ఫొటోలు పంపిన తర్వాత రెండో సారి.. స్లాబ్ పూర్తయ్యాక మూడో విడత డబ్బులు వస్తాయి. చివరగా ప్రారంభం అనంతరం చివరి బిల్లు వస్తుంది.

మండలానికి 1,054 ఇళ్లు మంజూరు

మండల పరిధిలో 1,054 ఇళ్లు మంజూరయ్యాయి. 323 మంది లబ్ధిదారులు వివిధ కారణాలతో ఇళ్లు నిర్మాణం చేపట్టలేమని రద్దు కొరకు దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 550 ఇళ్లు ప్రొగ్రెస్‌లో ఉన్నవి. బేస్మెంట్ లెవల్ 384, స్లాబ్ లెవల్ 53, వివిధ స్థాయిలో 154 ఇళ్లు ఉన్నాయి. 140 మంది లబ్ధిదారులు ఇంకా పనులు ప్రారంభించలేదు. లబ్ధిదారులు పనులు చేపట్టాలని పంచాయతీ, హౌసింగ్ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

రూ.4.39 కోట్ల నిధులు విడుదల



మండల వ్యాప్తంగా సుమారు 550 నిర్మాణాలకుగాను సుమారు రూ.4.39 కోట్ల నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమచేశాం. నిరుపేదలను గుర్తించి మహిళా సమాఖ్య ద్వారా రుణాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణానికి ప్రోత్సహిస్తున్నాం. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

– శైలజ, ఎంపీడీఓ, మహేశ్వరం

అవగాహన కల్పిస్తున్నాం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని పారదర్శకంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. యాప్‌పై వినియోగంపైలబ్ధిదారులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం . సాంకేతిక సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలి.

– బిక్కు నాయక్, హౌసింగ్ డీఈఈ, మహేశ్వరం

దివ్యాంగుల పింఛన్ పెంచాలి

ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్



తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సమితి నాయకులు, దివ్యాంగులు

బడంగ్‌పేట్: ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సమితి పిలుపు మేరకు సోమవారం బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్హులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధికార ప్రతినిధి బొర్ర రవి మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు రూ.4 వేల పెంచాలన్నారు. ఇప్పటి వరకు పెండింగులో ఉన్న దరఖాస్తు దారులకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ మణిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి మండల కన్వీనర్ ప్రభాకర్, డీకే నర్సింహ, మస్కూరు సుధాకర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బోధనా రుసుం చెల్లించాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కందుకూరు: పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్ నిధుల ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ ఢిల్లీ భానుప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పరిషత్ నాయకులతో కలిసి స్థానిక కూడలిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధనా రుసుం చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి.. విద్యార్థులు, విద్యా సంస్థల సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. వెంటనే బోధనా రుసుం, ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఏబీవీపీ నగర్ కార్యదర్శి గంగవరం వినయ్, ధరణి, మహేశ్, నందు, వరుణ్, విశ్వనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే తెలంగాణకు విమోచనం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కందుకూరు: అమరుల పోరాట ఫలితమే నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు స్వేచ్ఛా వాయువులు లభించాయని, వారిని నిత్యం స్మరించుకోవాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అధ్యక్షతన సేవా పక్వాడ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని ఎనిమిది సేవా కార్యక్రమాలను అన్ని గ్రామాల్లో నిర్వహించాలన్నారు. రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్ కార్యక్రమాలతో యువతను చైతన్య పర్చాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా నాయకులు కృష్ణగౌడ్, జిల్లా నాయకులు రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, అమరేందర్‌రెడ్డి, భిక్షపతి, నర్సింహారెడ్డి, సత్తయ్య, అచ్చన పాండు, జంగారెడ్డి, కృష్ణారెడ్డి, మల్లేశ్, ప్రభాకర్, రఘునందన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



కుముదునిని సన్మానిస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు మోడల్ స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయురాలు ఎం.కుముదుని ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, పుష్పలత, గురురాజారెడ్డి, సునీత, వెంకటరమణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న మిత్రబృందం

కందుకూరు: బాల్య మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మండల పరిధి గూడూరుకు చెందిన అందుగుల దశరథ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు దశరథతో కందుకూరు జెడ్పీ పాఠశాలలో 2002లో పదో తరగతి చదువుకున్న నాటి మిత్రులు.. అంతా కలిసి రూ.1 లక్షను సోమవారం ఉపాధ్యాయుడు ఎండీ.ఆయూబ్‌తో కలిసి స్నేహితుడి భార్యకు అందజేశారు. భవిష్యత్తులో అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సరికొండ పాండు, ఎంఆర్ రమేష్, శ్రీశైలం, చంద్రశేఖర్, ఎం.యాదగిరి, మతిన్, ఐలయ్య, అంజయ్య, ప్రవీణ్‌కుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బీసీ భావజాల ఉద్యమాన్ని పల్లెలకు విస్తరించాలి



సమావేశంలో పాల్గొన్న జాజుల శ్రీనివాస్ గౌడ్

నాగోలు: పాటనే ఆయుధంగా చేసుకుని తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపి, తెలంగాణ రాష్ట్రం సాధించినట్లుగానే బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చి బీసీల రాజకీయ అధికారం సాధించడానికి ఇప్పుడు కూడా పాటనే ఆయుధంగా చేసుకుని బీసీ కవులు, రచయితలు, కళాకారులు బీసీ భావజాల ఉద్యమాన్ని పల్లెలకు విస్తరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి నాగోలు సుప్రజా హాస్పిటల్‌లో బీసీ కల్చరల్ ఫోరం రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు వరంగల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా దరువు అంజన్న, కోదారి శ్రీనివాస్‌తో కలిసి ఆయన పాల్గొని మట్లాడారు. బీసీలకు వారసత్వంగా గొప్ప చరిత్ర ఉందని, బీసీ కులాలలో రాజులు, చక్రవర్తులు, మహనీయులు జన్మించారని, బీసీ కులాలలో తరతరాలుగా ఎంతో ప్రతిభ, పటావాలు కలిగిన చరిత్ర ఉందన్నారు. ఇలాంటి ఘనమైన చరిత్ర కలిగిన బీసీలు నేడు బలహీనంగా అరశాతం, ఐదు శాతం లేని వాళ్ల దగ్గర సాగిలపడి అడుక్కోవడంలో అర్థం లేదన్నారు. బీసీ సంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి దసరా తర్వాత 33 జిల్లాలో సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకన్న, రామలింగం, విజయ్ కుమార్, ప్రసాద్, సందీప్, సంతోష్, రమేష్, సంధ్య పాల్గొన్నారు.

కందుకూరు పీఏసీఎస్‌కు నూతన చైర్మన్

వెంకట్రామ్‌రెడ్డిని నియమిస్తూ ఉత్వర్వులు



నూతన చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డిని సన్మానిస్తున్న డైరెక్టర్లు, నాయకులు తదితరులు

కందుకూరు: కందుకూరు పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా సాయిరెడ్డిగూడకు చెందిన సత్తినేని వెంకట్రామ్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పీఏసీఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు అందించడంతో పాటు సొసైటీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. అనంతరం నూతన చైర్మన్‌ను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి, డైరెక్టర్లు పాండురంగారెడ్డి, పర్వతాలు, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్, సురేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, శ్రీధర్‌ముదిరాజ్, వీరారెడ్డి, మహేష్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్, అజీజ్, మధన్‌పాల్‌రెడ్డి, నిరంజన్ తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ నిమ్మ యాదగిరి రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టండి



న్యూమధురాపురి కాలనీలో పర్యటిస్తున్న మల్లారెడ్డి

బడంగ్‌పేట్: ఎస్‌ఎన్‌డీపీ ట్రంక్‌లైన్(నాలా)లో పేరుకుపోయిన ఇసుక, మట్టిని అధికారులు వెంటనే తొలగించి కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి కోరారు. సోమవారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 3,4 డివిజన్‌లో వేసిన ఎస్‌ఎన్‌డీపీ నాలాను పరిశీలించారు. న్యూమధురిపురి, అమరావతి, మధురాపురి, 4వ డివిజన్‌లోని బోయపల్లి ఎన్‌క్లేవ్, నవారు జంగారెడ్డి కాలనీ, రామిడి మల్లారెడ్డినగర్, సాయిబాలాజీ టౌన్‌షిప్, సీవైఆర్, సీఎంఆర్ తదితర కాలనీల మీదుగా గతంలో ట్రంక్‌లైన్ (ఎస్‌ఎన్‌డీపీ) వేశారన్నారు. వర్షాలు, వరదల కారణంగా మూసివున్న నాలాలోకి టన్నుల కొద్ది ఇసుక, మట్టి చేరుకుని వరదనీరు వెళ్లకుండా అడ్డుకుంటుందన్నారు. కొన్ని చోట్ల ఎస్‌ఎన్‌డీపీ నాలా పూడుకుపోయి వరదనీరు ఇళ్ల మీదుగా పారుతోందన్నారు. ఎస్‌ఎన్‌డీపీ నాలాకు ఇరువైపుల తవ్విన గుంతలు పూడ్చక పోవడంతో తిరిగి కొత్త గుంతలు ఏర్పడ్డాయన్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి ఎస్‌ఎన్‌డీపీ నాలాలో పేరుకుపోయిన ఇసుక, మట్టిని తొలగింపు పనులు చేపట్టాలని కోరారు. సమస్య పరిష్కారానికి నిధుల కోసం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌తో మాట్లాడి నిధులు మంజూరుకు యత్నిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ వినియోగించుకోండి



చెక్కులు అందజేస్తున్న సురేందర్

కందుకూరు: సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని వినియోగించుకోవాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అండేకార్ సురేందర్ సూచించారు. మండల పరిధిలోని ఆకులమైలారం గ్రామానికి చెందిన రావుల జంగయ్యకు రూ.60 వేలు, గుర్రం మమతకు రూ.43 వేలు, గొరిగె బుచ్చమ్మకు రూ.30వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి పథకం చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం ఆయన బాధితులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ చొరవతో ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు రాజు, రాంరెడ్డి, నాయకులు శ్రీశైలం, యాదగిరి, శ్రీకాంత్, సత్యం, సురేష్, పవన్, శ్రీనివాస్, రజనీకాంత్, శివ, మహేందర్‌రెడ్డి, రమేష్, రితీశ్, భాస్కర్, సూర్య, నరసింహ, అశోక్, వీరమ్మ, నరసింహ పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ నివారణ టీకా



శునకాలకు టీకా ఇస్తున్న వైద్యులు

పహాడీషరీఫ్: కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేయించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీరాం కాలనీలో బ్లూ క్రాస్ సంస్థ, డాక్టర్ కుమారీ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వీధి శునకాలతో పాటు పెంపుడు కుక్కలకు టీకా ఇప్పించాలన్నారు. అప్పుడు అది మనుషులను కరిచినా ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కాలనీలో మొత్తం 296 కుక్కలకు టీకాలు వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోయిన్ బాబా, పర్యావరణ అధికారి ఎం.శ్రీను, శానిటేషన్ సూపర్‌వైజర్ బుదుమాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భార్య గొంతు కోసిన భర్తకు రిమాండ్

నాగోలు: అదనపు కట్నం కోసంభార్య గొంతు కోసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోలు లక్ష్మీనర్సింహా స్వామి కాలనీలో అద్దె ఇంట్లో ఉండే ఉప్పుతల్లి వేణుగోపాల్, మహాలక్ష్మి భార్యాభర్తలు. పెళ్లి సమయంలో ఇచ్చిన వరకట్నం సరిపోలేదని అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఆదివారం బంధువుల ఇంట్లో గృహప్రవేశం వేడుకకు రావాలని మహాలక్ష్మి వేణుగోపాల్‌ని కోరగా కోపోద్రిక్తుడై పేపర్ కట్టర్ బ్లేడు తీసి ఆమె గొంతు కోశాడు. ప్రతిఘటించిన సమయంలో మహాలక్ష్మి కుడి చేతి చిటికెన వేలు తెగిపోయింది. రక్తపు మడుగులో బయటకు పరుగెత్తుకొచ్చింది. గాయపడిన మహిళను స్థానికులు వైద్యం కోసం హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం వేణుగోపాల్‌ను రిమాండ్‌కు తరలించారు.

22 నుంచి దసరా మహోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో అష్టలక్ష్మి ఆలయంలో ఈ నెల 22 నుంచి శరన్నవరాత్రి(దసరా) మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 22న అమ్మవారి సన్నిధిలో కలశస్థాపన పూజలు ఉంటాయన్నారు. ప్రతిరోజు అమ్మవారికి అలంకరణ, అర్చనలు ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు.

వెట్టిచాకిరీకి విముక్తి కల్పించిన పార్టీ సీపీఐ

హయత్‌నగర్: నిజాం రజాకార్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసి ప్రజలను వెట్టి చాకిరి నుంచి విముక్తి కలిగించింది సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం హయత్‌నగర్ ఆర్టీసీ డిపో ఆవరణలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతికారని, భూస్వాములు, జాగీర్దారులు ప్రజలను పీడిస్తుండడంతో కమ్యునిస్టులు ప్రజల తరపున తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొయినుద్దీన్ లాంటి నాయకులు దున్నే వాడిదే భూమి అనే నినాదంతో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ప్రజలను సమాయత్తం చేశారని, సుమారు 3 వేల గ్రామాలను వెట్టి చాకిరి నుంచి విముక్తి చేశారని తెలిపారు. వారి పోరాటాన్ని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారి త్యాగ ఫలితంగానే తెలంగాణ విముక్తి పొందిందన్నారు.